# 11న మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

**(గొల్లప్రోలు పెన్ పవర్ సెప్టెంబర్ :8)**జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 11న మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక గొల్లప్రోలు మండల అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓ. పాపారావు తెలిపారు. గొల్లప్రోలు మెయిన్‌రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు మాత్రమే మండల స్థాయి పరీక్షకు అర్హులని తెలిపారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీ నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకు పాఠశాలకు చేరుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 10.30 గంటలకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు కోరారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## జగ్గంపేట డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి ఉచితంగా భోజనం అందించారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సేవా స్ఫూర్తితో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. పేదలు, కూలీలు, వృద్ధులు, ఆపదలో ఉన్న వారికి భోజనం అందించడం ద్వారా వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. అన్నదాన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు తుమ్మలపల్లి రమేష్ స్వయంగా భోజనం వడ్డించారు. భోజనం చేస్తున్న వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణే యువత విజయానికి సరైన దారి





## కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** యువత సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ సానుకూల దృక్పథంతో లక్ష్యాలపై దృష్టి సారించాలని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు క్రమశిక్షణతో కూడిన నిరంతర కృషి ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. మహిళా అభివృద్ధి––శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమన్వయంతో మంగళవారం కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో 'యువ సఖి' గ్రూప్ లీడర్లకు జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'పిల్లలే దేశ సంపద––వారి భద్రతే మన బాధ్యత' అనే నినాదంతో ఒత్తిడి నిర్వహణ,భావోద్వేగ నియంత్రణ, సైబర్ భద్రత, బాలల పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు,సభ్యులు గంగా సూర్యనారాయణ,సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ గంటా సత్యనారాయణ,జిల్లా విద్యాధికారి పి.రమేష్,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జె. రాంబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయం సాధించాలనే కోరికతో పాటు దానికోసం కృషి చేయాలని సూచించారు. వ్యక్తిగత జీవితంలో విజయానికి క్రమశిక్షణ అత్యంత కీలకమని, ప్రేరణ తాత్కాలికమైనప్పటికీ క్రమశిక్షణతో కూడిన నిరంతర కృషి ఉంటే ఏ రంగంలోనైనా సఫలత సాధ్యమన్నారు. ఫోన్లు, సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేసుకుంటే పోటీ ప్రపంచంలో వెనుకబడిపోతారని హెచ్చరించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య ప్రవేశ పరీక్షల్లో తీవ్ర పోటీ ఉందని, విద్యార్థులు కష్టపడి చదువుతూ భావోద్వేగాలను నియంత్రించుకుని ఒత్తిడిని తట్టుకునే మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలు సమాజానికి శాపమని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఆడపిల్లలకు చదువే నిజమైన రక్షణ అని, బాల్య వివాహాల సమాచారం తెలిస్తే 1098కు తెలియజేయాలని సూచించారు. 'యువ సఖి' గ్రూపు సభ్యులు తమ తోటి విద్యార్థులకు మంచి మార్గదర్శకులుగా నిలవాలని, మత్తు పదార్థాల బారిన పడుతున్న వారిని సన్మార్గంలో నడిపించేందుకు సహకరించాలని కోరారు.రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల్లో మంచి నడవడిక,సంస్కారం, దేశభక్తి పెంపొందాలని అన్నారు.పర్యావరణ పరిరక్షణ, కుటుంబ విలువలు, మాతృభాషాభిమానం,స్వదేశీ వస్తువుల వినియోగం, పౌర విధుల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆపదలో ఉన్న పిల్లల కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించు కోవాలని కోరారు. సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ గంటా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా,మొబైల్ ఫోన్ల వంటి ఆకర్షణలకు దూరంగా ఉంటూ విలువైన సమయాన్ని లక్ష్య సాధనకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాజులూరుకు చెందిన కె.జానకి రత్నప్రభను కలెక్టర్,ఇతర అధికారులు ఘనంగా సత్కరించారు. చిన్న వయసులోనే తండ్రిని,అనంతరం తల్లిని కోల్పోయిన ఆమె కేజీబీవీ తొండంగిలో చదువుకుని పట్టుదలతో నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటరావు, ఈగల్ టీం సీఐ వెంకటేశ్వరరావు, సీడీపీవోలు,ఇతర అధికారులు పాల్గొన్నారు.








## జగ్గంపేటలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేడుకలు

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ సి. హెచ్. బాలరాజు ఆధ్వర్యంలో ఆంగ్ల, తెలుగు విభాగాధిపతులు సంయుక్తంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని గురించి విద్యార్థులకు అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని, అక్షరాస్యత ఉజ్వల భవిష్యత్తుకు మార్గం అనే సందేశంతో విద్యార్థులకు ప్రసంగం నిర్వహించారు. అక్షరాస్యత అనేది కేవలం చదవడం, రాయడం మాత్రమే కాదని, జ్ఞానం, నైపుణ్యాలు, అవకాశాలకు అది ద్వారం వంటిదని వివరించారు. అక్షరాస్యత వ్యక్తుల్లో ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించి, సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి కౌలు రైతు హక్కుదారు కార్డులపై అవగాహన సదస్సులు

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జగ్గంపేట సబ్ డివిజన్లోని అన్ని గ్రామాల్లో కౌలు రైతులకు ఈనెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కౌలు రైతు హక్కుదారు కార్డులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట ఏడిఏ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సంబంధిత బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు ఉద్యాన సహాయకులు పాల్గొని కౌలు రైతులకు సి సి ఆర్ సి కార్డుల ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. కావున కౌలు రైతులందరూ ఈ అవగాహన సదస్సుల్లో పాల్గొని, కౌలు రైతు హక్కుదారు కార్డులకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## అన్నవరం అన్నప్రసాదంలో ఏమైంది ఆ రుచి?

### సాంబారు, కొబ్బరి పచ్చడి రుచిపై భక్తుల అసంతృప్తి

పెన్ పవర్ ప్రతినిధి (అన్నవరం), సెప్టెంబర్ 08: కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. స్వామివారి దర్శనంతో పాటు దేవస్థానం అందించే అన్నప్రసాదాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.అయితే ఇటీవల అన్నప్రసాదం రుచిపై పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో అన్నదానం విభాగంలో అందించే భోజనంలో రుచికరమైన సాంబారు, కొబ్బరి పచ్చడి ఉండేవని, వాటితో అన్నప్రసాదాన్ని భక్తులు ఎంతో తృప్తిగా స్వీకరించేవారని పలువురు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం అందిస్తున్న అన్నప్రసాదంలో గతంలో ఉన్న రుచి, నాణ్యత కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో పాటు వృద్ధులు, చిన్నారులతో వచ్చే భక్తులకు అన్నప్రసాదం ఎంతో ముఖ్యమని పేర్కొంటున్నారు. భక్తులకు అందించే ప్రసాదం రుచికరంగా, నాణ్యంగా ఉండేలా దేవస్థానం అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

**అధికారులు పరిశీలించాలి**

అన్నదానం విభాగంపై దేవస్థానం అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, భక్తుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించాలని వారు కోరుతున్నారు. గతంలో భక్తుల ప్రశంసలు అందుకున్న విధంగా రుచికరమైన సాంబారు, కొబ్బరి పచ్చడితో అన్నప్రసాదాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని అన్నప్రసాదం రుచి, నాణ్యత, పరిశుభ్రత విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులను భక్తులు కోరుతున్నారు.

# ఐ న్యూస్ జర్నలిస్టుల అరెస్టును ఖండించిన ఏపీజేఎఫ్

**అక్రమ కేసులు ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్**

**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** రాష్ట్ర మంత్రి ఫరూఖ్ కుమారులకు సంబంధించిన అంశాలపై ఐ న్యూస్ ఛానల్‌లో కథనాలు ప్రసారం చేసిన నంద్యాల ఐ న్యూస్ రిపోర్టర్లను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ కాకినాడ జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీజేఎఫ్) నాయకులు వీధి సాయినాథ్, రెడ్డిపల్లి రాజేశ్ తీవ్రంగా ఖండించారు. నంద్యాలలో జరుగుతున్న పలు అంశాలను ప్రజల దృష్టికి తీసుకువచ్చే ఉద్దేశంతో ఐ న్యూస్ రిపోర్టర్లు కథనాలు ప్రసారం చేశారని వారు పేర్కొన్నారు. ఆ కథనాల్లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ఖండనలు తెలియజేయవచ్చని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని అన్నారు. ఆధారాలు లేని వార్తలు ప్రసారం చేశారనే అభ్యంతరం ఉంటే పరువునష్టం దావా వేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. అయితే, ఇందుకు విరుద్ధంగా జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులకు పాల్పడటం, కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు విమర్శించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే మీడియా వ్యవస్థ సమాజంలోని లోపాలను వెలుగులోకి తీసుకువస్తున్న సందర్భంలో, వాటిపై సరైన రీతిలో స్పందించకుండా జర్నలిస్టులపై చర్యలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. వార్తలు ప్రసారం చేసిన జర్నలిస్టులపై అన్యాయంగా కేసులు నమోదు చేసి, అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. వారిని అదుపులోకి తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్‌ను అధికారికంగా చూపించలేదని వారు విమర్శించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర డీజీపీ వెంటనే స్పందించాలని వీధి సాయినాథ్, రెడ్డిపల్లి రాజేశ్ డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న ఐ న్యూస్ జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయడంతో పాటు, వారిపై నమోదు చేసినట్లు ఆరోపిస్తున్న కేసులను ఎత్తివేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.



## మట్టి వినాయకుడినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- పర్యావరణ మిత్ర గంగాధర్



**గండేపల్లి, పెన్ పవర్ (సూరంపాలెం), సెప్టెంబర్ 08:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజకు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ ఆఫీసర్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, పెదబ్రహ్మదేవం శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. మనం చేసే పూజలు మనకు, మన తోటి వారికి, సమాజానికి మేలు కలిగించినప్పుడే భక్తి, ముక్తి, ఆనందానికి సార్థకత చేకూరుతుందని అన్నారు. ఆడంబరాలకు వెళ్లి ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన రంగురంగుల విగ్రహాలను వినియోగించవద్దని సూచించారు. మట్టి, నీటిలో త్వరగా కరిగిపోయే సహజసిద్ధమైన మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే వినియోగించాలని కోరారు. ఇతర పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించడం వల్ల పర్యావరణానికి హాని కలగడంతో పాటు భావితరాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించి ప్రకృతిని కాపాడాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ఈ విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గత 20 సంవత్సరాలుగా శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి, పెదబ్రహ్మదేవం ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని గంగాధర్ కోరారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

## ఏపీ గ్రీన్ సొసైటీ చైర్మన్ నాగబాబుకు ఘన సత్కారం.

- గొల్లప్రోలు జనసేన సీనియర్ నాయకులు కడారి నాయుడు



**గొల్లప్రోలు (పెన్ పవర్ సెప్టెంబర్ :8)**ఆంధ్రప్రదేశ్ గ్రీన్ సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా కాకినాడ విచ్చేసిన కొణిదల నాగబాబును పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు సీనియర్ జనసేన నాయకులు కడారి తమ్మయ్య నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును శాలువాతో ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ గ్రీన్ సొసైటీ చైర్మన్‌గా నాగబాబు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, హరితాంధ్రప్రదేశ్ నిర్మాణంలో కీలకంగా పనిచేయాలని తమ్మయ్య నాయుడు ఆకాంక్షించారు.

## కోనసీమ తిరుమల వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

- శ్రీవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు -- స్వామివారికి వెండి కానుకలు సమర్పించిన పి.గన్నవరం దంపతులు



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 8:**కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రం మంగళవారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు భక్తిశ్రద్ధలతో శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.
స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. వాడపల్లి క్షేత్రంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. స్వామివారికి వెండి కానుకలు ఈ సందర్భంగా పి.గన్నవరానికి చెందిన నందపునీడి గణేష్--భూలక్ష్మి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామివారికి విశేషమైన వెండి కానుకలను సమర్పించారు. సుమారు 468 గ్రాముల బరువు, రూ.1,19,340 విలువైన వెండి సతగోపురం, చిన్న పళ్లెం, తులసికోటలను స్వామివారికి భక్తిపూర్వకంగా సమర్పించారు. భక్తిశ్రద్ధలతో కానుకలు సమర్పించిన దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వదించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్లు పులపర్తి రాంబాబు, వెంకటరాజు దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి అభినందించారు. స్వామివారి దర్శనం, అన్నప్రసాద స్వీకరణతో భక్తులు ఆధ్యాత్మికానందాన్ని పొందారు. భక్తుల గోవింద నామస్మరణలతో వాడపల్లి క్షేత్రం మార్మోగింది.

# ఎర్రంపాలెం గ్రామపంచాయతీలో ఎంపీడీవో ఆకస్మిక పరిశీలన

- అభివృద్ధి పనుల పరిశీలన.. మస్టర్ రిజిస్టర్ల తనిఖీ

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 08:** గండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామపంచాయతీలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) హరికృష్ణ సత్య రెడ్డి మంగళవారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను, ఉపాధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
అనంతరం ఆయా పనులకు సంబంధించిన మస్టర్ రిజిస్టర్లను తనిఖీ చేసి, పనులకు హాజరవుతున్న కూలీల వివరాలు, హాజరు నమోదు తదితర అంశాలను పరిశీలించారు. పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.
ఈ పర్యటనలో గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు



## ఆదిత్య విశ్వవిద్యాలయ అధ్యాపకుడు అయ్యప్ప రాజుకు డాక్టరేట్



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 08:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న చెక్కా బాపి అయ్యప్ప రాజు జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఎన్ఐటీ) మేఘాలయ నుంచి తత్వశాస్త్రంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) సాధించారు. ఈ విషయాన్ని ఆదిత్య విశ్వవిద్యాలయ ప్రో-ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. జాతీయ సాంకేతిక విద్యాసంస్థ మేఘాలయకు చెందిన డా. సంజయ్ దెబ్బర్మ నేతృత్వంలో, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో అయ్యప్ప రాజు పరిశోధన పూర్తి చేశారు.
'పునరుత్పాదక ఇంధన ఆధారిత విద్యుత్ వ్యవస్థల్లో స్మార్ట్ ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగించి విద్యుత్ గ్రిడ్ తరంగదైర్ఘ్య స్థిరత్వాన్ని మెరుగుపరచడం' అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనా సిద్ధాంతానికి డాక్టరేట్ లభించింది. అయ్యప్ప రాజు సాధించిన ఈ ఘనత పట్ల ఆదిత్య విశ్వవిద్యాలయ అధినేత, ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి హర్షం వ్యక్తం చేసి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో-వైస్ ఛాన్సలర్ డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, విభాగాధిపతి డా. వి. శ్రీనివాసతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అయ్యప్ప రాజును అభినందించారు.

# రాజోలు పోలీస్‌స్టేషన్ ఎదుట తీవ్ర ఉద్రిక్తత

- రోడ్డు ప్రమాదంలో యువతి మృతి.. న్యాయం కోసం జాతీయ రహదారిపై బాధితుల బైఠాయింపు





**పెన్ పవర్ ప్రతినిధి (రాజోలు) సెప్టెంబర్ 08** డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో రోడ్డు ప్రమాద ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సోంపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లు పూజ (29) మృతి చెందింది. ప్రమాద ఘటనపై తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు, బాధితులు రాజోలు పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. పెద్దఎత్తున బాధితులు రోడ్డుపై బైఠాయించడంతో రాజోలు పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళనకారులు నినాదాలు చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి, ఆందోళనకారులతో చర్చలు జరిపే ప్రయత్నం చేశారు. బాధితుల డిమాండ్లను అధికారులు పరిగణనలోకి తీసుకుని, ఘటనపై న్యాయబద్ధంగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## విద్యుత్ రక్షణ వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన

### ఆదిత్య విశ్వవిద్యాలయంలో ప్రత్యేక అతిథి ఉపన్యాసం



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 08:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం విద్యుత్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'విద్యుత్ నియంత్రణ పరికరాలు, రక్షణ వ్యవస్థలు, విద్యుత్ కేంద్రాల సురక్షిత నిర్వహణ' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం జాతీయ తాప విద్యుత్ సంస్థకు చెందిన సీనియర్ మేనేజర్ కె. రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ నియంత్రణ పరికరాలు, రక్షణ వ్యవస్థల ప్రాధాన్యత, విద్యుత్ పరికరాల భద్రత, సాంకేతిక లోపాలను గుర్తించే విధానాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యుత్ వ్యవస్థల భద్రతకు ఆధునిక రక్షణ పద్ధతులు ఎంతో కీలకమని, విద్యుత్ కేంద్రాల నిర్వహణలో నిర్దేశిత భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన వివరించారు. పరిశ్రమల్లో అనుసరించే ఆచరణాత్మక విధానాలను నిపుణుల ద్వారా నేరుగా తెలుసుకునే అవకాశం ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు లభిస్తుందని విభాగాధిపతి డా. వి. శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడంతో పాటు, పరిశ్రమల్లో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లను అర్థం చేసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ప్రో-వైస్ ఛాన్సలర్ (అకడమిక్) డా. ఎస్. రమాశ్రీ, ప్రో-వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ అండ్ సైన్స్) డా. ఎ. రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

### గణేష్ మండపాలు, నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 08:** రానున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గండేపల్లి మండలంలో గణేష్ మండపాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. గండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్ఓ)తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కే, పద్మజా ,ఎంపీడీఓ హరికృష్ణ సత్యారెడ్డి, సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) పాల్గొని గ్రామాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. గణేష్ మండపాల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గణేష్ నిమజ్జనం సమయంలో ప్రజలు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేలా గ్రామస్థాయిలో అవసరమైన చర్యలు ముందుగానే చేపట్టాలని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో కట్రీ చంద్ర రావు, డిప్యూటీ ఎంపీడీవో, ఎంఈఓ నాయక్ తదితరులు ఉన్నారు.

# రావులపాలెం వేదికగా వైఎస్సార్‌సీపీ సమరశంఖం..

**స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కేడర్‌కు దిశానిర్దేశం.. ప్రభుత్వ వైఫల్యాలపై రాజకీయ పోరాటానికి కార్యాచరణ**





**రావులపాలెం. పెన్ పవర్ సెప్టెంబర్ 8:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ కార్యకలాపాలకు మరోసారి ఊపునిచ్చే దిశగా జిల్లా విస్తృత స్థాయి సమావేశం వేదికైంది. జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెం సీఆర్‌సీలో నిర్వహించిన ఈ సమావేశానికి శాసన మండలి ప్రతిపక్ష నేత, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశం కేవలం సంస్థాగత సమీక్షకే పరిమితం కాకుండా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో పార్టీని పునర్వ్యవస్థీకరించుకునే వ్యూహానికి సంకేతంగా నిలిచింది.

### కేడర్‌నే ప్రధాన అస్త్రంగా..

పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అంటూ బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు సమావేశంలో కీలకంగా మారాయి. అధికారంలో లేని సమయంలో పార్టీ శ్రేణులను క్రియాశీలంగా ఉంచడం, గ్రామస్థాయి నుంచి సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలను కొనసాగించడం వంటి అంశాలపై ఆయన ప్రధానంగా దృష్టి సారించారు.ప్రజలతో నేరుగా మమేకమయ్యే రాజకీయ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కేవలం పార్టీ సమావేశాలు, ప్రకటనలకే పరిమితం కాకుండా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై పోరాటాలు నిర్వహించాలని నాయకత్వం సూచించింది. ఈ నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయికి విస్తరించే బాధ్యతను స్థానిక నాయకత్వంపై ఉంచినట్లు సమావేశం ద్వారా స్పష్టమైంది.

'వెన్నుపోటు పార్టీ.. వెన్నుపోటు పాలన'తో రాజకీయ సమీకరణం కూటమి ప్రభుత్వ పాలన, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ప్రధాన రాజకీయ అంశాలుగా మలచుకునేందుకు వైఎస్సార్‌సీపీ వ్యూహరచన చేస్తున్నట్లు సమావేశం చర్చలు సూచించాయి.ఇందులో భాగంగా 'వెన్నుపోటు పార్టీ.. వెన్నుపోటు పాలన' కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి విస్తృతంగా నిర్వహించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు పేర్కొంది. గతంలో పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి నిరసన కార్యక్రమాలను నిర్వహించిన సందర్భాలు కూడా ఉన్నాయి; రావులపాలెంలోనూ కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగినట్లు పార్టీ ప్రచురణల్లో నమోదైంది.అయితే ఈసారి కార్యక్రమాన్ని కేవలం నిరసనగా కాకుండా.. ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు స్థితి, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించే రాజకీయ ప్రచార కార్యక్రమంగా మలచుకోవాలనే దిశగా పార్టీ శ్రేణులకు సూచనలు అందినట్లు తెలుస్తోంది.

### స్థానిక ఎన్నికలే తదుపరి పరీక్ష

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకత్వానికి కీలక రాజకీయ పరీక్షగా మారనున్న నేపథ్యంలో సమావేశంలో ఈ అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. గ్రామస్థాయిలో పార్టీకి ఉన్న సంప్రదాయ కేడర్‌ను సమన్వయం చేయడం, నాయకుల మధ్య అంతర్గత సమన్వయాన్ని పెంచడం, ప్రజా సమస్యలపై నిరంతరంగా స్పందించడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని బలోపేతం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామాల్లోకి వెళ్లకుండా.. ఇప్పటి నుంచే ప్రజలతో నిరంతర సంబంధాలను కొనసాగించాలని నాయకత్వం స్పష్టం చేసింది. ప్రతి గ్రామంలో కార్యకర్తల బృందాలను క్రియాశీలం చేయడం, స్థానిక సమస్యలను గుర్తించడం, వాటిపై పోరాటాలు చేపట్టడం ద్వారా పార్టీకి రాజకీయంగా మళ్లీ బలం చేకూర్చుకోవచ్చన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

### ఐడెంటిటీ కార్డులతో సంస్థాగత గుర్తింపు

సమావేశంలో ముఖ్య నాయకులకు వైఎస్సార్‌సీపీ ఐడెంటిటీ కార్డులను బొత్స సత్యనారాయణ అందజేయడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ నిర్మాణంలో ప్రతి స్థాయి నాయకుడి పాత్రను స్పష్టీకరించడంతో పాటు, నాయకులు--కార్యకర్తల మధ్య సంస్థాగత అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశానికి ఇది ప్రతీకగా నిలిచింది.ఇది కేవలం గుర్తింపు కార్డుల పంపిణీగా కాకుండా.. పార్టీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో మరింత వ్యవస్థీకృతం చేసే ప్రక్రియలో భాగంగా పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమావేశ పరిణామాలు సూచించాయి.

### చిర్ల నాయకత్వంలో జిల్లా కేడర్‌కు భరోసా

జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.అధికారంలో లేని సమయంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు రాజకీయంగా, సంస్థాగతంగా భరోసా కల్పించడం కూడా జిల్లా నాయకత్వం ముందున్న మరో ముఖ్యమైన అంశంగా కనిపిస్తోంది. గ్రామస్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రజా సమస్యలను పార్టీ ఉద్యమాలతో అనుసంధానించడం ద్వారా కేడర్‌లో విశ్వాసాన్ని పెంచే ప్రయత్నం జరుగుతున్నట్లు సమావేశ సందేశం స్పష్టం చేసింది.

### రాజకీయ సందేశం

సమావేశానికి అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు, పీఏసీ సభ్యులు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, సీఈసీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శులు, ఎస్ఈసీ సభ్యులు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.రావులపాలెం సీఆర్సీ ప్రాంగణం పార్టీ శ్రేణుల నినాదాలతో సందడిగా మారడం ద్వారా జిల్లాలో కేడర్‌ను మరోసారి సమీకరించే ప్రయత్నానికి ఈ సమావేశం వేదికగా నిలిచింది. మొత్తంగా చూస్తే.. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వంపై రాజకీయ దాడి, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పోరాటాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు సన్నద్ధత అనే నాలుగు అంశాల చుట్టూ వైఎస్సార్‌సీపీ కోనసీమ జిల్లా రాజకీయ కార్యాచరణను కేంద్రీకరించనున్నట్లు సమావేశం ద్వారా స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి.

# జనసేన సైనికుడికి అరుదైన గౌరవం.

- కాకినాడ పార్లమెంట్ స్థానిక ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడిగా ఉలిసి అయిరాజు.
- గోనేడలో జనసేన శ్రేణులు అయిరాజుకు ఘన సన్మానం.



**కిర్లంపూడి,పెన్ పవర్,సెప్టెంబర్, 08:**జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గానికి కిర్లంపూడి మండలానికి చెందిన ఉలిసి అయిరాజు కాకినాడ పార్లమెంట్ పరిధిలో స్థానిక ఎన్నికల నిర్వహణ సమన్వయ కమిటీ సభ్యుడిగా ఎన్నిక కావడం పట్ల జనసేన శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా గోనేడ గ్రామంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అయిరాజుకు ఘనంగా సన్మానం చేశారు. గోనేడ గ్రామం జనసేన జెండాలు, నినాదాలతో కోలాహలంగా మారింది.పార్టీని నమ్ముకుని, జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి నిబద్ధతతో పనిచేసిన సామాన్య కార్యకర్తకు అరుదైన గౌరవం దక్కిందని పలువురు రాజకీయ నేతలు అభినందించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తికి కేంద్ర కార్యాలయం నుంచి ఇంతటి పెద్ద బాధ్యత ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు.కష్టపడి పనిచేసే సామాన్య కార్యకర్తలను గుర్తించి బాధ్యతలు అప్పగించడం జనసేనలోనే సాధ్యమని, ఇది పవన్ కళ్యాణ్ నాయకత్వ ప్రత్యేకతకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.రాబోయే మున్సిపాలిటీ, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి స్ఫూర్తిని కొనసాగిస్తూ జనసేన తరఫున యువత పెద్ద ఎత్తున పోటీ చేసి వంద శాతం విజయం సాధించేలా కమిటీ కృషి చేయాలని పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ కాన్ఫరెన్స్ కాల్ లో దిశానిర్దేశం చేశారని అయిరాజు తెలిపారు.తనపై ఉంచిన బాధ్యతను నిబద్ధతతో, చిత్తశుద్ధితో, నిజాయితీగా నిర్వహిస్తానని, తనకు ఈ గౌరవం, గుర్తింపు ఇచ్చిన పవన్ కళ్యాణ్ కు, జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి, తన 12 ఏళ్ల ప్రయాణంలో తోడుగా నిలిచిన నియోజకవర్గ, మండల, గ్రామ జనసైనికులకు ధన్యవాదాలు తెలిపారు.

# గొల్లప్రోలులో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

- న్యాయ సాక్షరతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం.






**(గొల్లప్రోలు పెన్ పవర్ సెప్టెంబర్ 8)**అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని "ప్రజలు, పర్యావరణం, సుసంపన్నత కోసం న్యాయ సాక్షరత" అనే అంశంపై గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి 12వ ఏడీజే కోర్టు ప్యానల్ న్యాయవాది మర్రి సత్యవతి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల హక్కులు, బాధ్యతలు, అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్యానల్ లెవల్ వాలంటీర్ మొండి సూరిబాబు మాట్లాడుతూ ప్రజలకు, పర్యావరణానికి సంబంధించిన హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖ అధికారి వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు, బాలలు, వృద్ధులు, వినియోగదారుల హక్కులతో పాటు న్యాయ పరిరక్షణకు సంబంధించిన అంశాలను విద్యార్థులకు వివరించారు.దఅనంతరం పాఠశాల ఆవరణలో న్యాయవాది మర్రి సత్యవతి మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓరుగంటి పాపారావు, వెంకటేశ్వరరావు, సీఆర్ఎంటీ ఆకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కైలాస భూమికి 20 సెంట్ల భూదానం



**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కోలంక గ్రామంలో కైలాస భూమి ఏర్పాటుకు 20 సెంట్ల భూమిని విరాళంగా అందించిన దాతలను కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అభినందించారు. బొండా శ్రీరామమూర్తి మనవడు గోపాలరావు, ఉదయగిరి ముత్యాలు, పిండిప్రోలు భీమశంకరం భూమిని దానం చేశారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కైలాస భూమి కోసం భూదానం చేయడం గొప్ప సామాజిక సేవ అన్నారు. వ్యక్తిగత ఆస్తిని సమాజ ప్రయోజనాల కోసం త్యాగం చేయడం అరుదైన విషయమని, దాతల సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కైలాస భూమి ఏర్పాటుతో గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, గ్రామ అభివృద్ధి చరిత్రలో దాతల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. సమాజానికి చేసిన సేవే శాశ్వత సంపద అని పేర్కొంటూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెట్ట గోపాలరావు, నామ సూరిబాబు, బూరెల పెద్దకాపు, బొండా కృష్ణ, నందికొల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# చేబ్రోలులో జిల్లా వ్యవసాయ అధికారి సుడిగాలి పర్యటన





**-ప్రత్తి--మల్బరీ పంటల పరిశీలన.. రైతులకు పలు సూచనలు**

**(గొల్లప్రోలు పెన్ పవర్ సెప్టెంబర్ :8)** చేబ్రోలు గ్రామం లో జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు మంగళవారం చేబ్రోలు గ్రామంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రత్తి, మల్బరీ పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటల సాగు, ఎదురవుతున్న సమస్యలపై రైతుల నుంచి వివరాలు తెలుసుకుని పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా పట్టు రైతులు తమ సమస్యలను జిల్లా వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రత్తి పంటకు వినియోగించే పురుగు మందుల ప్రభావం మల్బరీ తోటలపై పడటంతో పట్టు పురుగులకు హాని కలుగుతోందని, ఫలితంగా పట్టుపురుగులు పట్టుగూడు కట్టడం లేదని తెలిపారు. దీనివల్ల పట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు.ప్రత్తి, మల్బరీ తోటలను జోన్ పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు తెలిపారు. ఈ అంశంపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.కౌలు రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహనకౌలు రైతులు, సీసీఆర్సీ కార్డు కలిగిన రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు ప్రతి రైతు సేవా కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అర్హత ఉన్న రైతులకు వారి సమీపంలోని బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి. స్వాతి, మండల వ్యవసాయ అధికారి కె.వి.వి. సత్యనారాయణ, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ బి. గీతారాణి, పట్టు పరిశ్రమ శాస్త్రవేత్త ఇ. భువనేశ్వరి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పైల రాజా, పుట్ట ఉదయ్‌కుమార్, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

**విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర**



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 08** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఎస్. వెంకట సూర్యకుమారి, బీఎస్ఎస్ఆర్ గోపాల్ను గండేపల్లి మండలం మల్లేపల్లిలోని శుభప్రద్ కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారి కేహెచ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్‌రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్య దొర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినూత్న పద్ధతుల్లో బోధన సాగిస్తూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను విద్యార్థులకు అలవర్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవప్రదమైన స్థానం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరెడ్డి, యూటీఎఫ్ నాయకులు సతీష్, రాజబాబు, తేలు శ్రీను, రాజనాల శ్రీను, విద్యా కమిటీ చైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావుతో పాటు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురము పెన్ పవర్ సెప్టెంబర్ 8 ఈరోజు కొత్తపల్లి జనసేన ఇంచార్జ్ రావు అక్షయ్ ఆధ్వర్యంలో యు కొత్త పల్లి మండలం మూలపేట గ్రామంలో సిఎం ఆర్ ఫ్ చెక్కులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మూలపేట జనసేన పార్టీ ఇంచార్జ రామిశెట్టి రాంబాబు, కంబాల రాంబాబు, వాసుపల్లి ఉప్పాకు, కాకాడ శ్రీనివాస్, మెరుగు రాజారావు, రావిశెట్టి కొండయ్య, సిద్ధి సత్యనారాయణ, సిద్ధి మురళి, ముప్పిడి అప్పయ్యమ్మ,జుశ ఎంపీటీసీ పేరూరి నాగేశ్వరరావు, జల్లా శివాజీ ఈసరపు దుర్గ మరియు జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొనడం జరిగింది.

